క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్‌లో సరఫరా అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, చైతన్యపురి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, వడ్డేపల్లి చర్చి, బాలయ్య హోటల్, రాఘవేంద్ర నగర్, స్నేహ నగర్, భవానినగర్, సూర్య ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, గోపాల్‌పూర్, బ్యాంక్ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, కనకదుర్గ కాలనీ, సుభాష్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, ఎన్జీవోఎస్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సిగ్మా కళాశాల ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు అభ్యుదయ రచయితల సంఘం సభ

విద్యారణ్యపురి: ఈనెల 9న సాయంత్రం హనుమకొండలోని ఆదర్శ లా కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం సభను నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, కవి, విమర్శకుడు ప్రొఫెసర్ బన్న అయిలయ్య, అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, బాధ్యులు పల్లెరు వీరస్వామి, సుమిత్ర, బూర భిక్షపతి హాజరవుతారని పేర్కొన్నారు.

15న మన ఆలోచన సాధన సమితి ఆవిర్భావ సభ



నయీంనగర్: ఈనెల 15న మన ఆలోచన సాధన సమితి ఆవిర్భావ సభ వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగరావు ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాయంత్రం జరగనుందని కోర్ కమిటీ సభ్యుడు దొంత ఆనందం తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆనందం మాట్లాడుతూ మన ఆలోచన సాధన సమితి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆవుల వెంకన్న, పూసల నర్సింహ, కాశీనాథం, డోలి మొగిలి, నారాయణ గౌడ్, పీఎల్ఎస్.రావు, సమ్మయ్య, వెంకట్ యాదవ్, నారాయణ గిరిరాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సదస్సులు

హసన్‌పర్తి: అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో వినియోగదారుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు కమిషన్ చైర్మన్ వేణుగోపాల చారి తెలిపారు. హసన్‌పర్తి మండలం నాగారం సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం లోకల్ కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కొన్ని సమస్యలను అక్కడక్కడే పరిష్కరించారు. ఏడీఈ అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ఈ మధుసూదన్ రావు, కె.రమేష్, రౌతు చరణ్, ఏఈ తరుణ్, శిరీష్, చింతగట్టు టౌన్ ఏఈ సత్యనారాయణ, లైన్ ఇన్‌స్పెక్టర్ రౌతు రమేష్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ

మడికొండ: మ్యాథ్స్, సైన్స్‌లలో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన (ఆర్ఏఏ) రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ పోటీ పరీక్షల్లో మడికొండ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి డి.ఆసిస్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ బత్తుల కుమారస్వామి తెలిపారు. ఈమేరకు ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, రాజేంద్రప్రసాద్, టెన్సింగ్, జ్యోతి, చలపతి, శ్రీనివాస్, హారతి, స్వాతి, శంకర్, విద్యాసాగర్, సుమలత, రాజేందర్ అభినందించారు.

ముగిసిన పికిల్ బాల్ టోర్నమెంట్

కాజీపేట / కాజీపేట రూరల్: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ స్టే ఫిట్ స్పోర్ట్స్ జోన్‌లో మొదటిసారిగా నిర్వహించిన పికిల్ బాల్ టోర్నమెంట్ వేడుకలు సోమవారం ముగిశాయి. రాష్ట్రం నుంచి 16 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఫైనల్ పోరులో మొదటి స్థానంలో వెంకటేశ్వర్లు (సీఐ, సీసీఎస్ భూపాలపల్లి), ఎం.సంజయ్ (ఆర్పీఎఫ్ సీఐ, కాజీపేట), రెండో స్థానంలో ప్రణీత్, శ్రవణ్, మూడో స్థానంలో రెహాన్, నిఖిల్ గెలుపొందారు. విజేతలకు నిర్వాహకులు నగదు పురస్కారాలతో పాటు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. ప్రణీత్, సృజన్, ప్రదీప్, పవన్, డాక్టర్ డేవిడ్, విజయ్, రమేష్, సతీష్, రిషి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందికి జైలు

వరంగల్ క్రైం: వరంగల్ ట్రై సిటీ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు డ్రంకెన్ తనిఖీల్లో పట్టుబడిన 14 మంది వాహనదారులకు రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించగా, మరో ఇద్దరికి సామాజిక సేవ చేయాలని న్యాయమూర్తి తీర్పు వెల్లడించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. అలాగే, మరో 75 మందికి జరిమానా విధించారని పేర్కొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

- ఖమ్మం బైపాస్ రోడ్డుపై ప్రమాదాలు
- కల్వర్టు వద్ద పొంచి ఉన్న ప్రమాదం
- వీధిలైట్లు లేక రాత్రి వేళల్లో అంధకారం



కారును ఢీకొట్టి పెద్ద చెరువులోకి దూసుకెళ్లిన టిప్పర్ (ఫైల్)

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామం మీదుగా ఖమ్మం బైపాస్ రోడ్డులో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్గమధ్యలో ఉన్న పెద్ద చెరువు దగ్గర ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. కడిపికొండ బ్రిడ్జి మీదుగా ఖమ్మం, వరంగల్‌కు వెళ్లే వేలాది వాహనాలు రోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ బైపాస్ రోడ్డులో హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేవు. అలాగే, వీధి లైట్లు, కూడళ్లలో హైమాస్ట్ లైట్లు కూడా లేవు. దాంతో ఈ దారిలో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు

కడిపికొండ నుంచి ఖమ్మంకు వెళ్లే బైపాస్ రోడ్డుపై మార్గమధ్యంలోని కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేవు. దాంతే వేగంగా వెళ్లే వాహనదారులు వంతెన వద్ద ఎదురెదురుగా ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. కడిపికొండ, భట్టుపల్లి, కొత్తపల్లి, కొండపర్తి, అమ్మవారిపేట, ఉర్సుగుట్ట, వరంగల్, ఖమ్మంకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్గంలో ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కడిపికొండ నుంచి భట్టుపల్లి మార్గంలో వెళ్తున్న కారును బోర్‌వెల్ టిప్పర్ ఢీకొని పెద్ద చెరువు మత్తడిలోకి దూసుకెళ్లింది. అలాగే, ఓ కారును తప్పించబోయి ఆటో డ్రైవర్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ఓ ద్విచక్ర వాహనదారుడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇలా రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటోంది. కూడళ్లలో హైమాస్ట్ లేవు. ఈక్రమంలో రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి బైపాస్ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, సూచిక బోర్డులు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు వేడుకుంటున్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సఖి నిర్వాహకులు

కాజీపేట అర్బన్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం అడ్మిన్ హైమావతి అన్నారు. నగరంలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత మహిళలు 181, 1098, 0870 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించాలని కోరారు. సదస్సులో లీగల్ అడ్వైజర్ శ్రీదేవి, కౌన్సెలర్ విజయలక్ష్మి, కేస్ వర్కర్లు అనూష, కరుణ, సునీత, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

హసన్‌పర్తి: వివిధ కారణాలతో ఇబ్బందులు, వేధింపులకు గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా నిలుస్తోందని సఖి కేంద్రం అడ్మిన్ హైమావతి, కేస్ వర్కర్ అనూష తెలిపారు. హసన్‌పర్తి మండలం సీతంపేటలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖి కేంద్రం అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు 181 నంబర్‌కు కాల్ చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు.

పాల వ్యాన్ల బిల్లులు చెల్లించండి



హన్మకొండ చౌరస్తా: పెండింగ్‌లో ఉన్న పాల రవాణా వ్యాన్ల బిల్లులను చెల్లించాలని ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్ట్ వాహనాల యజమానులు కోరారు. విజయ డెయిరీ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రైతుల నుంచి సేకరించిన పాలను డెయిరీకి, డెయిరీ నుంచి పాల ప్యాకెట్లను దుకాణాలకు చేరవేసే తమ వాహనాలను అకారణంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జనగామ, పాలకుర్తి, మహబూబాబాద్, ఏటూరునాగారం రూట్లకు చెందిన పీటీసీ వాహన యజమానులు ఉన్నారు.

ఆదివాసీలపై దాడులు నిలిపివేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: మధ్య భారతదేశంలో ఆదివాసీలపై కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న దాడులు, హత్యాకాండను తక్షణమే నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి కృష్ణ డిమాండ్ చేశారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సీపీఐ (ఎంఎల్), అఖిల భారత రైతు – కూలీ సంఘం (ఏఐకేఎంఎస్), ఆలిండియా కేత్ మజ్దూర్ కిసాన్ సభ (ఏఐకేఎంకేఎస్) ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు, అడవీ సంపదను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పే ప్రయత్నాలను కేంద్రం ఉపసంహరించుకోవాలని సూచించారు. ఆదివాసీలపై జరుగుతున్న హత్యాకాండలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, దోషులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బైరబోయిన ఐలయ్య, రఘుసాల సుమన్, జెన్నారం రాజేందర్, చిక్కుల మొగిలి, ఎడబోయిన శీను, దోనెటి కనకయ్య, శీను, కనకయ్య పాల్గొన్నారు.

భూ బాధితులకు ఉద్యోగాలివ్వాలి



కాజీపేట రూరల్: కాజీపేట మండలం మడికొండ – అయోధ్యపురం శివారులో నిర్మిస్తున్న రైల్వే వ్యాగన్‌షెడ్ నిర్మాణంతో భూములు కోల్పోయిన వారికి అందులో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భూ బాధితులు కోరారు. ఈమేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను హనుమకొండలోని స్వగృహంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉల్లెంగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభలను నిర్వహించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ జార్జిరెడ్డి వర్ధంతి వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, విద్యార్థుల హక్కులు, శాస్త్రీయ విద్యావిధానం, సమ సమాజ స్థాపన కోసం పోరాడిన జార్జిరెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి వినయ్, కేయూ ప్రధాన కార్యదర్శి కావ్య, బాధ్యులు అనూష, గణేష్, చందన, యాదగిరి, సంగీత, పెరియార్, శ్రీజ, హరికృష్ణ, మనోజ్, రమ్య, వినీల, నవ్య తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

విద్యారణ్యపురి: ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జార్జిరెడ్డి వర్ధంతి సభలను హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనిల్, పవన్, రాజేష్, ఆర్యవర్ధన్, అజయ్, కిరణ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్నారు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న చర్చి ప్రతినిధులు

హసన్‌పర్తి: హిందూ మతానికి చెందిన మహిళలకు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్న సంఘటన 55వ డివిజన్ భీమారంలో చోటు చేసుకుంది. హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన మునిగంటి భారతమ్మ – సతీష్ దంపతులు 15 ఏళ్ల క్రితం భీమారానికి వచ్చి స్థిరపడ్డారు. రజక కులవృత్తి నిర్వహిస్తూ జీవితం వెళ్లదీస్తున్నారు. వారికి సంతానం లేరు. అయితే, భారతమ్మ (68) ఆదివారం వడదెబ్బకు గురై మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించడానికి చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు పెంతకోస్తు చర్చి ప్రతినిధులు ముందుకు వచ్చారు. ఈక్రమంలో స్థానికులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తమకు తోచిన సహాయం చేశారు. అనంతరం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం భారతమ్మ మృతదేహాన్ని సమాధి చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు బేన్‌హర్, అబ్రహం, స్థానికులు సంగాల విక్టర్‌బాబు, కోటేశ్వర్, పెండ్యాల వీనస్, ప్రవీణ్, డేవిడ్, సునీల్, రాజు, ఉదమ్ కుమార్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



మెట్టుగుట్టపై వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



కాజీపేట: శ్వేతార్క ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం



రైల్వే ఆలయ కాంప్లెక్స్‌లో మహా అన్నదానం

మడికొండ: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మెట్టుగుట్టపై స్వామివారికి ఉదయం 8గంటలకు హోమం, బలిహరణ, వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు నిత్యహోమం, బలిహరణ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషుభారతి, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లపు అర్జున్, అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, అభిలాష్ శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో శ్రీరామ పట్టాభిషేకాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆస్థాన పండితులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ – రమ దంపతులు దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

వీరాంజనేయ – సువర్చలదేవి కల్యాణం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే దేవాలయ కాంప్లెక్స్‌లో వీరాంజనేయ స్వామి సువర్చలదేవి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వేదమంత్రాలు, మంత్రోచ్చరణల మధ్య వేడుక జరిగింది. అనంతరం మహా అన్నదానం చేశారు.

సంక్షిప్తంగా

నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

కాజీపేట: రెండున్నర దశాబ్దాలుగా వైఎస్సార్ నగర్ కాలనీలో గుడిసెలు వేసుకుని దుర్భర పరిస్థితులలో జీవిస్తున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ పథకం కింద గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. కాజీపేట 62వ డివిజన్‌లోని వైఎస్సార్ కాలనీలో పార్టీ కార్యకర్తలు సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. సుమారు 200 కుటుంబాలు నిలువనీడ లేక గుడిసెలు వేసుకుని బతుకుతున్న విషయంపై ఎమ్మెల్యే నాయిని దృష్టిని సారించి వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సర్వేలో జంపాల రమేష్, సంటి రవి, రామంచ సారంగపాణి, జయ, పోచయ్య, రమ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కోరారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బక్క దానయ్య, అసోసియేషన్ ప్రతినిధులు ఉపేందర్, రౌతు రమేష్ కుమార్, కృష్ణ, గోపి, రాజేందర్, రవి, చలపతి పాల్గొన్నారు.

సమస్యలను విస్మరిస్తున్న అధికారులు

హన్మకొండ చౌరస్తా: ప్రజల సమస్యలను పరిష్కరించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి ఆరోపించారు. పార్టీ నార్త్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా సమస్యల అధ్యయన యాత్రను 5వ డివిజన్‌లోని దాసరివాడలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో నార్త్ ఏరియా కమిటీ కార్యదర్శి గాదె రమేష్, నాయకులు మంద మల్లేశం, ఇంజపల్లి రాజు, పాపయ్య పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

కేయూ క్యాంపస్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే లాంటి బహుజన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ కోరారు. కాకతీయ యూనివర్సిటీలోని సెనెట్‌హాల్‌లో బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బహుజన మహనీయుల సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు. సభలో బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, రాజనీతిశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, ప్రశాంత్, ఇఫ్లూ యూనివర్సిటీ బీఎస్ఎఫ్ అధ్యక్షుడు వికాస్, కేయూ బాధ్యులు శ్రీహిత, ధర్మేంద్ర, విశాల్, శివ, రాజేష్ పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: వరంగల్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవోఎస్ నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ సత్యశారదకు కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ మాట్లాడుతూ త్వరలో చేపట్టబోయే పంచాయతీ కార్యదర్శుల బదిలీలను సీనియార్టీ ప్రాతిపదికగా నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యదర్శి గాదె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు యాకూబ్ నాయక్, సదానందం, బాధ్యులు రజిత, రఘు, పంచాయతీ ఫోరం రాష్ట్ర సహాధ్యక్షులు సదానందం, అశోక్, హుస్సేన్, సరిత, అనిత, రాజు పాల్గొన్నారు.

బల్దియా జేఏసీ డైరీ రూపకల్పన భేష్

వరంగల్ అర్బన్: బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) –2025 డైరీ సమగ్ర సమాచారంతో రూపకల్పన చేయడం భేష్ అని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. ఈమేరకు యూనియన్ నాయకులను అభినందించారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో డైరీ, క్యాలెండర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేష్, గౌరవ అధ్యక్షుడు ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, కోశాధికారి స్వర్ణన్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, కార్యదర్శి బాలు నాయక్, ఉపాధ్యక్షుడు రావుల ఆనంద్, వింగ్ అధికారులు ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డీఎఫ్ఓ శంకర్ లింగం, సెక్రటరీ అలివేలు, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, హెచ్ఓ రమేష్ పాల్గొన్నారు.

నాసిరకం మందుల అమ్మకంపై ఫిర్యాదు

ఖిలా వరంగల్: రాష్ట్రంతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాసిరకం మందుల అమ్మకం, బోగస్ చిరునామాలతో రూపొందిన మందుల కర్మాగారాలపై ఇటీవల జాతీయ మండలిలో ఫిర్యాదు చేసినట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనతో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, హర్యానాలో సుమారు 20 నకిలీ మందుల తయారీ సంస్థలు.. హిమాచల్ ప్రదేశ్ చిరునామాతో అమ్మకాలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. గత నెల 22, 23, 24వ తేదీల్లో రాష్ట్రం, జిల్లా వ్యాప్తంగా నాసిరకం మందులు, బోగస్ చిరునామాలతో మందుల తయారీపై ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు.

మెడికవర్‌లో ప్రత్యేక హెల్త్ చెకప్ ప్యాకేజీ

కాజీపేట అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం రూ.21,080 విలువగల వైద్య పరీక్షలు కేవలం రూ.2,025 అందించేలా ప్రత్యేక హెల్త్ చెక్అప్ ప్యాకేజీని సోమవారం విడుదల చేసింది. కన్సల్టెంట్ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ శ్రావణ్ కుమార్ రాంపల్లి, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ డాక్టర్ రత్న కార్తీక్‌రెడ్డి, కన్సల్టెంట్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ పూర్ణచంద్, కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డాక్టర్ అముతుల్ హఫ్సా, కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ అరుణ్ కుమార్, సెంటర్ హెడ్ నమ్రత పాల్గొన్నారు.

'మల్లికాంబ'లో వైద్య శిబిరం

హన్మకొండ అర్బన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని పిల్లలకు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నాగార్జున రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులను స్వయంగా పరిశీలించి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్‌రెడ్డి, ఐఎంఏ సభ్యులు డాక్టర్ అజిత్ మహ్మద్, శిరీష్‌కుమార్, మన్మోహన్ రాజ్, మోహన్ రావు, మల్లేషం, సుదీప్, మల్లికాంబ నిర్వాహకులు బండా రామలీల, కల్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

టీఆర్‌పీఈయూలో చేరిన విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ: బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఆర్‌పీఈయూ) చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు విద్యుత్ ఉద్యోగులు తమ యూనియన్‌లో చేరుతున్నారని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్ తెలిపారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు, సంక్షేమానికి టీఆర్‌పీఈయూ కృషి చేస్తుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో నిజామాబాద్‌లో 25 మంది ఉద్యోగులు టీఆర్‌పీఈయూలో చేరారని తెలిపారు.

సంఘాన్ని అప్రతిష్టపాలు చేయొద్దు

ఖిలా వరంగల్: సభ్యులు పనిగట్టుకొని సంఘాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని, సభ్యుల అభ్యున్నతే లక్ష్యంగా కార్యవర్గం పనిచేస్తోందని సంఘం అధ్యక్షుడు బోరిగం నర్సింగం, సంఘ సలహాదారు, స్థానిక కార్పొరేటర్ సిద్దం రాజు సూచించారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ ఏకశిల నగర్‌లోని ఏకశిల పాదుపు పరపతి సంఘం భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. సంఘంలో 1805 మంది సభ్యులు ఉన్నారని, సభ్యుల్లో కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘంపై బురదజల్లడం సరికాదన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ ప్రతినిధులు అబ్జలొద్దీన్, తంగెళ్ల దేవేందర్, కొండి వీరాచారి, మెంతుల యాదగిరి, మొహినొద్దీన్, నాయిని రాజేశ్వరి, పవుడాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కాజీపేట రూరల్: గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, సైబర్ మోసాల బారిన పడొద్దని, చదువుపై శ్రద్ధ వహించాలని కాజీపేట ఎస్సై శివకృష్ణ సూచించారు. నేతాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్సై పిలిప్ రాజు, కాజీపేట ఏఎస్సై శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ బాబురావు, ఇన్‌చార్జ్ ఉమెన్ ఏఎస్సై నాగమణి, హెచ్‌సీఎస్ విలియమ్, తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



అధికారులతో సమీక్షిస్తున్న వరంగల్ కలెక్టర్

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని అన్ని మండలాల పరిధి 150 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వారంలోగా ప్రారంభించాలని అధికారులను కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను తయారు చేసి వెంటనే అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని, మిగతా వాటిని కూడా వారంలోగా ప్రారంభించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద సంచులు ఉంచాలని, కాంటాలు సరిగ్గా ఉన్నాయా లేదా? అని ముందే చూసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య.. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, 2 బీహెచ్‌కే ఇళ్ల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

వరంగల్: యాసంగి ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సహకార శాఖ, ఐకేపీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024–25 సంవత్సరానికి సుమారు 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1.90 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం, 30 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సహకార శాఖ 107, ఐకేపీ ఆధ్వర్యంలో 60, మెప్మా ఆధ్వర్యంలో 2, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్డీఓ కౌసల్య దేవి, డీసీఎస్ఓ కిష్టయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సంధ్యారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా అధికారులు నీరజ, రేణుక పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న నారాయణ

కేయూ క్యాంపస్: రక్తదానం మరొకరికి ప్రాణదానం లాంటిదని కేయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, హెల్త్ క్లబ్స్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సీతారాములు, గన్‌సింగ్, సంధ్యారాణి, శ్రీనివాస్, ఎన్‌సీసీ ఆఫీసర్ రమేష్, కేర్ టేకర్ ప్రసూన, హెల్త్ క్లబ్ కన్వీనర్ రోహిణి పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ రక్తదానం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంజీఎం రక్తనిధి సేకరణ కేంద్రాలు సంయుక్తంగా చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొల్లెపల్లి రాజేశ్వర్, ఆరెల్లి శ్రీనివాస్, కోశాధికారి సంజీవ రెడ్డి, మాజీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, డాక్టర్ ఆశాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ పరిపాలన భవనం వద్ద కాంట్రాక్టు అధ్యాపకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుక్టా బాధ్యులు డాక్టర్ కరుణాకర్, డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి తీసుకొచ్చిన జీఓను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకులు ఆశీర్వాదం, సాదు రాజేష్, ఫిరోజ్‌పాషా, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, నాగయ్య, ప్రణీత, చందులాల్, సూర్యనారాయణ, సంగీతకుమార్, ఉషాకిరణ్, బ్లెస్సీ, ప్రియాంక, సాంబశివరావు, మధుకర్‌రావు, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.